సర్వేకు సర్వం సిద్ధం

- కొనసాగుతున్న స్టిక్కరింగ్‌ ప్రక్రియ
- బేగంపేట సర్కిల్‌లో 432 మంది ఎన్యుమరేటర్లు, 43 మంది సూపర్‌వైజర్లు
- సనత్‌నగర్‌, అమీర్‌పేట డివిజన్లలో 220 మంది ఎన్యుమరేటర్లు..
- వందకు పైగా ప్రశ్నలతో కూడిన దరఖాస్తులు సిద్ధం



సనత్‌నగర్‌: సమగ్ర కుటుంబ సర్వే నిర్వహణకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. ఈ నెల 6 నుంచి చేపట్టే ఈ సర్వేకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే సర్వే ఏవిధంగా చేపట్టాలనే అంశంపై సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేశారు. ప్రస్తుతం ఇంటింటికీ స్టిక్కరింగ్‌ ప్రక్రియ కొనసాగుతోంది. నేడో, రేపో ఆ తంతును పూర్తి చేసి సమగ్ర కుటుంబ సర్వే క్షేత్రంలోకి సిబ్బంది దిగనున్నారు. సర్వేకు సంబంధించి రూట్‌మ్యాప్‌, సిబ్బందికి అందజేయాల్సిన మెటీరియల్‌ అంతా సిద్ధంగా ఉంది. సనత్‌నగర్‌ నియోజకవర్గం బేగంపేట సర్కిల్‌ పరిధి కిందికి వచ్చే బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, మోండా డివిజన్ల వ్యాప్తంగా 432 మంది సిబ్బంది ఈ సర్వేలో పాలుపంచుకోనున్నారు. ప్రాథమిక పాఠశాల సిబ్బంది, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ, జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పాటు అవసరమైతే రీసోర్స్‌పర్సన్‌ (ఆర్పీ)లను కూడా ఈ సర్వేకు ఉపయోగించనున్నారు. సర్కిల్‌ వ్యాప్తంగా 43 వేల ఇళ్లు ఉండగా ఒక్కో సిబ్బందికి 150 ఇళ్ల చొప్పున సర్వే బాధ్యతలను కేటాయించనున్నారు. సర్వే చేసినందుకు గాను రూ.10 వేల చొప్పున పారితోషికం కూడా అందజేయనున్నారు. ప్రతి 10 మంది సిబ్బందికి ఒక సూపర్‌వైజర్‌ సర్వే బాధ్యతలను పర్యవేక్షించనున్నారు. బిల్‌కలెక్టర్‌, ట్యాక్స్‌ ఇన్‌స్పెక్టర్ల స్థాయి అధికారులకు సూపర్‌వైజర్‌ బాధ్యతలను అప్పగించారు. ఖైరతాబాద్‌ సర్కిల్‌ పరిధి కిందికి వచ్చే సనత్‌నగర్‌, అమీర్‌పేట, డివిజన్ల వ్యాప్తంగా 220 మంది ఎన్యుమరేటర్లు సర్వే చేయనున్నారు. సనత్‌నగర్‌ నియోజకవర్గం వ్యాప్తంగా 652 మంది ఎన్యుమరేటర్లు ఈ సర్వేలో భాగం కానున్నారు.

ఏయే వివరాలు సేకరిస్తారంటే..

ఇప్పటికే సర్వేకు సంబంధించి సర్వే ఫారం ప్రభుత్వం విడుదల చేసింది. ఈ ఫారం ఆదివారం సోషల్‌ మీడియాలో సైతం చక్కర్లు కొట్టింది. పేరు, కుటుంబ పెద్దతో సంబంధం, లింగం, మతం, కులం వర్గం, ఉపకులం, వయస్సు, మాతృభాష, ఆధార్‌ నెంబర్‌, ఓటరు ఐడీ నెంబర్‌, వైకల్యం స్థితి, వివాహ స్థితి, పెళ్లి సమయంలో వయస్సు, పిల్లలు స్కూల్‌ ప్రారంభించిన వయస్సు, చదివిన పాఠశాల రకం, విద్యార్హతలు, వార్షిక ఆదాయం, బ్యాంక్‌ ఖాతా వివరాలు, ఆదాయపు పన్ను స్థితి, విద్య, ఉద్యోగంలో రిజర్వేషన్‌ ప్రయోజనాల ప్రాప్తి, రాజకీయ నేపథ్యం, ప్రస్తుతం ఉన్న పదవులు, భూముల యాజమాన్యం, ధరణి పాస్‌బుక్‌ వివరాలు, వ్యవసాయ రుణాలు, ప్రభుత్వ ఆరోగ్య పథకాల వినియోగం, సంక్షేమ పథకాల వినియోగం, రేషన్‌కార్డు రకం, కుటుంబంలో ఆరేళ్ల లోపు పిల్లలు, వంట ఇంధనం రకం ఇలా దాదాపు 100 ప్రశ్నలకు పైగా సమాధానాలను ఈ సర్వే ద్వారా తెలుసుకోనున్నారు. కుటుంబాల నుంచి అధికారులు సేకరించే ఆయా వివరాలకు సంబంధించిన ప్రశ్నలను ప్రభుత్వం విడుదల చేసిన ఫారంలో పొందుపర్చారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో రెండు దశలుగా కుటుంబాల నుంచి వివరాలు సేకరించనున్నట్లు ఈ ఫారాల ద్వారా తెలుస్తోంది. పార్ట్‌–1లో కుటుంబ యజమానికి సంబంధించిన వివరాలతో పాటు కుటుంబ సభ్యులకు సంబంధించిన సమాచారాన్ని అధికారులు నమోదు చేయనున్నారు. ఈ సర్వేను ఎలా చేపట్టాలో అధికారులు సంబంధిత సిబ్బందికి సూచించి సంబంధిత ప్రశ్నలను కూడా అందజేశారు. నవంబర్‌ 6వ తేదీ నుంచి ఈ సర్వే ప్రారంభం కానుంది. సర్వే ఫారం చివరగా కుటుంబ యజమాని పేరు, మొబైల్‌ నెంబర్‌, సంతకం, తేదీ రాయాల్సి ఉంటుంది. అలాగే సర్వేకు వచ్చిన ఎన్యుమరేటర్‌తో పాటు సూపర్‌వైజర్‌ పేరు, మొబైల్‌ నెంబర్‌, సంతకం ఉండాలి.

దిశ కమిటీ సభ్యురాలిగా శారదా మల్లేశ్‌



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన దిశ కమిటీ సభ్యురాలు శారదామల్లేశ్‌

సికింద్రాబాద్‌: హైదరాబాద్‌ జిల్లా దిశ కమిటీ సభ్యురాలిగా మెట్టుగూడకు చెందిన బీజేపీ నాయకురాలు శారదామల్లేశ్‌ నియమితులయ్యారు. మెట్టుగూడ డివిజన్‌ బీజేపీ నాయకురాలిగా, మహంకాళి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధిగా పనిచేస్తున్న శారదా మల్లేశ్‌ దిశ కమిటీ సభ్యురాలిగా నియమితులు కావడం పట్ల పలువురు బీజేపీ నాయకులు ఆమెను కలిసి అభినందించారు. ఆదివారం కేంద్ర మంత్రి జీ.కిషన్‌రెడ్డిని శారదామల్లేశ్‌ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ కేంద్రమంత్రి సహకారంతో దిశ కమిటీ సభ్యురాలిగా తన వంతు కృషి చేస్తానన్నారు.

ఏసు సూక్తులు ప్రతిఒక్కరూ ఆచరించదగినవి



మాట్లాడుతున్న సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: ఏసుక్రీస్తు సూక్తులు ప్రతిఒక్కరూ ఆచరించదగినవని మాజీ మంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ అన్నారు. అమీర్‌పేట డివిజన్‌ ఎస్‌ఆర్‌నగర్‌లోని క్రిస్టియన్‌ ఫెలోషిప్‌ చర్చిలో నిర్వహించిన కృతజ్ఞతార్పణం పండుగలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సన్మార్గంలో పయనించాలని, సాటి వారికి సహాయపడాలనే ఏసుక్రీస్తు బోధనలను పాటించాలని కోరారు. పండుగలు ఎన్ని ఉన్నప్పటికీ ప్రపంచం మొత్తం జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్‌ అన్నారు. అనంతరం చర్చి నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ శేషుకుమారి, చర్చి కమిటీ ప్రతినిధులు జాయ్‌ మనోరమ పాల్గొన్నారు.

వినియోగదారులకు అవగాహన సదస్సు



వినియోగదారుల అవగాహన సదస్సులో ప్యారడైజ్‌ డివిజన్‌ అధికారులు

సనత్‌నగర్‌: వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ట్రాన్స్‌కో ప్యారడైజ్‌ డివిజనల్‌ కార్యాలయంలో వినియోగదారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కులను తెలియజేయడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వినియోగదారులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని డీఈ బ్రహ్మానందం స్పష్టం చేశారు. విద్యుత్‌ వినియోగదారులు తమ శాఖాపరంగా ఎదుర్కొనే సమస్యలను తమ దృష్టికి తెచ్చిన వెంటనే సత్వర పరిష్కారానికి చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏడీఈలు దుర్గాప్రసాద్‌, మహేష్‌, రమణలతో పాటు ఏఈలు, సబ్‌ ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ ఆలోచనా విధానంతో ముందుకు వెళ్లాలి



అంబేడ్కర్‌ విగ్రహానికి జ్ఞానమాల సమర్పిస్తున్న నాయకులు

లాలాపేట: దళిత బహుజన వర్గాలు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఆలోచనా విధానంతో ముందుకు వెళ్లాలని బహుజన నాయకులు తుంగ లక్ష్మణ్‌ అన్నారు. ఆదివారం చింతల్‌లోని అంబేడ్కర్‌ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణ్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో చిన్న, మనోహర్‌, ప్రసన్న, నవీన్‌ తదితరులున్నారు.

జైన్‌ సమాజ్‌ సేవా కార్యక్రమాలు అభినందనీయం



కార్యక్రమంలో పాల్గొన్న రాగిడి లక్ష్మారెడ్డి

రసూల్‌పురా: జంట నగరాల్లో జైన్‌ సమాజ్‌ చేస్తున్న సమాజ సేవ కార్యక్రమాలు అభినందనీయ మని బీఆర్‌ఎస్‌ మల్కాజిగిరి పార్లమెంట్‌ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. దీపావళి స్నేహ మిలన్‌ కార్యక్రమం సందర్భంగా ఆదివారం జైన్‌ సమాజ్‌ ఆధ్వర్యంలో కంటోన్మెంట్‌ క్లాసిక్‌ గార్డెన్‌లో ఉచిత కంటి. రక్తదాన శిబిరం నిర్వ హించారు. రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్‌ మాజీ చైర్మన్‌ టీఎన్‌. శ్రీనివాస్‌. బీఆర్‌ఎస్‌ నాయకులు కుమార్‌, శ్యామ్‌రెడ్డి, దేవరాజ్‌, ఫర్ధీన్‌, దేవులపల్లి శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆకాశ దీపోత్సవం



సనత్‌నగర్‌: కార్తీక మాస మహోత్సవాల్లో భాగంగా సనత్‌నగర్‌ హనుమాన్‌ దేవాలయ ప్రాంగణంలోని శివాలయంలో ఆదివారం ఉదయం అభిషేక మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఆకాశ దీపోత్సవాన్ని కన్నులపండువగా జరిపారు. ఆకాశ దీపారాధన ఉత్సవాన్ని తిలకించేందుకు సనత్‌నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో కార్తీకమాస విశేష పూజలు వైభవంగా జరుగుతున్నాయి.

ఆటోడ్రైవర్‌ అదృశ్యం



రాజు

సనత్‌నగర్‌: ఆటోడ్రైవర్‌ అదృశ్యమైన సంఘటన సనతనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ కృష్ణాగౌడ్‌ తెలిపిన మేరకు.. మోతీనగర్‌ ప్రాంతంలోని పీఆర్‌నగర్‌ హేమావతినగర్‌లో నివసించే పిల్లి రాజు (35) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 23వ తేదీన రోజూమాదిరిగానే ఆటో తీసుకుని ఇంటి నుంచి వెళ్ళిన రాజు ఇప్పటివరకు తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో వారు సనత్‌నగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిధులు, నియామకాలతోనే వర్సిటీల బలోపేతం

ఉస్మానియా యూనివర్సిటీ: నిధులు, నియామకాలతోనే రాష్ట్రంలోని అన్ని వర్సిటీలు బలోపేతం అవుతాయని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ పీహెచ్‌డీ స్కాలర్‌ ఎస్‌ నాగేశ్వర్‌ రావు ఆదివారం పేర్కొన్నారు. వర్సిటీల వీసీలు, ఉన్నత విద్యా మండలి అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలతో పాటు వివిధ అంశాలపై చర్చించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కానీ వర్సిటీలలో ప్రతి ఏటా అధ్యాపకుల ఉద్యోగ విరమణ, 15 ఏండ్లు గా నియామకాలు చేపట్టనందున అన్ని కోర్సుల విభాగాల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రతి ఏటా ప్రభుత్వం విడుదల చేసే బ్లాక్‌ గ్రాంట్స్‌ నిధులు వర్సిటీ సిబ్బంది వేతనాలు, పింఛన్లకే సరిపోతుందని మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అవసరాలకు నిధులు సరిపోవడం లేదన్నారు. వర్సిటీల్లో చదివే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు గత మూడు సంవత్సరాలుగా కోట్ల రూపాయల స్కాలర్‌షిప్‌ పెండింగ్‌లో ఉన్నందున వర్సిటీల క్యాంపస్‌ కాలేజీల ఖజానా ఖాళీ అయిందన్నారు. సీఎం రేవంత్‌ రెడ్డి స్పందించి వర్సిటీల పూర్వ వైభవానికి సరిపడా నిధులు విడుదల చేసి నియామకాలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు.

7న జాతీయ సెమినార్‌



జాతీయ సెమినార్‌ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంసీపీఐ నాయకులు

అడ్డగుట్ట: ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, మతోన్మాద కార్పొరేట్‌ శక్తుల ప్రమాదం, వామపక్ష కమ్యూనిస్ట్‌ శక్తుల కర్తవ్యం అనే అంశంపై ఈ నెల 7న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ సెమినార్‌ ఏర్పాటు చేసినట్లు జాతీయ ఎంసీపీఐ (యు) అడ్డగుట్ట డివిజన్‌ కార్యదర్శి యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం అడ్డగుట్ట బీ సెక్షన్‌ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి వాల్‌ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సెమినార్‌కు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి. మల్లేష్‌, ఐక్య ప్రజా నాట్య మండలి ఎస్‌ రాజు, ఎం. శంకర్‌, ఏసిటియు సికింద్రాబాద్‌ ఏరియా అధ్యక్షుడు ఎస్‌ లక్ష్మణ్‌, కామ్రేడ్‌ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ కూలినా ఫిర్యాదు చేయలేదు!

కారు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయని జీహెచ్‌ఎంసీ అధికారులు



కూలిపోయిన ప్రహరీగోడ, ఫెన్సింగ్‌..

బంజారాహిల్స్‌: కేబీఆర్‌ పార్కును ఆనుకుని జీహెచ్‌ఎంసీ వాక్‌వే ప్రహరీగోడతోపాటు ఫెన్సింగ్‌తోను అదుపుతప్పిన ఓ కారు ఢీకొట్టడంతో ధ్వంసమైన సంఘటన విధితమే. అయితే రెండు రోజులక్రితం ఈ ఘటన జరగగా ఇంత వరకు జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–18 అధికారులు చర్యలు తీసుకోలేదు. ఫుట్‌పాత్‌తో పాటు పార్కు ప్రహరీ గోడ, ఫెన్సింగ్‌ ధ్వంసమైన ఘటనకు కారకులైన వారిపై ఇంతవరకు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేస్తే సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఈ ఘటనపై ఇంజినీర్లు స్పందించకపోగా, కూలిపోయిన గోడను, ఫెన్సింగ్‌ను ఇంకా నిర్మించ లేదు. దీంతో అసాంఘిక శక్తులు కూలిన గోడ ప్రాంతంలో లోనికి ప్రవేశించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం కూడా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇక్కడ గోడ నిర్మించి ఫెన్సింగ్‌ ఏర్పాటుచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సెంట్రల్‌ వర్సిటీ ఎన్నికలపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తా

ఇండిపెండెంట్‌ అభ్యర్థి ఆకాష్‌ భాటి



సమావేశంలో మాట్లాడుతున్న ఆకాష్‌ భాటి

పంజగుట్ట: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో విద్యార్థి సంఘం నాయకున్ని ఎన్నుకునేందుకు జరిగిన ఎన్నికల్లో ఎన్నో అవకతవకలు జరిగాయని దీనిపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ఎన్నికల్లో ఇండిపెండెంట్‌ అభ్యర్థిగా బరిలో ఉన్న ఆకాష్‌ భాటి తెలిపారు. తన అపోజిషన్‌ పార్టీకి 28 చెల్లని ఓట్లు ఉన్నా వాటిని పరిగణలోకి తీసుకుని కేవలం 18 ఓట్ల తేడాతో తాను ఓడిపోయినట్లు ప్రకటించారని, ఎన్నికలకు అధికారులుగా వ్యవహరించిన కొంతమంది తన ప్రత్యర్థి పార్టీ వారికి వత్తాసు పలికారని అన్ని ఆధారాలతో తాను హైకోర్టును ఆశ్రయించనున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 26వ తేదీన ఎన్నికలు జరగగా 27వ తేదీన ఓట్ల లెక్కింపు జరిగిందని అధ్యక్షుని బరిలో మొత్తం ఏడుగురు ఉండగా, ఎస్‌ఎఫ్‌ఐ, ఎఎస్‌ఏ, బీఎస్‌ఎఫ్‌, డీఎస్‌యూ నలుగురు కలిసి పోటీ చెయ్యగా వారికి 1313 ఓట్లు వచ్చాయని, ఇండిపెండెంట్‌ అభ్యర్థినైన తనకు 1295 ఓట్లు వచ్చినట్లు పేర్కొన్నారన్నారు. కానీ మొత్తం 30 బ్యాలెట్‌ పేపర్లపై రెండుసార్లు స్టాంప్‌ కొట్టారని వాటిని తొలగించాలని చెపితే దానికి వారు నిరాకరించి, తమ కౌంటింగ్‌ ఏజెంట్‌ను గదిలో వేసి బంధించి పోలింగ్‌ ఏజెంట్లు లేకుండానే రిజల్ట్‌ డిక్లేర్‌ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము రీకౌంటింగ్‌ జరపాలని ఎన్నికల అధికారికి, వీసీకి, ఉన్నతాధికారులు అందరికీ వినతి పత్రాలు ఇవ్వగా వారు ఈనెల 2వ తేదీన రీకౌంటింగ్‌ జరుపుతూ తిరిగి చెల్లని ఓట్లు కౌంట్‌ చేస్తున్నారన్నారు. అధికారులు కూడా వారికే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. వెంటనే ఎన్నికల కమిటీని బయటివారిని నియమించి వారి ఆధ్వర్యంలో రీకౌంటింగ్‌ చెయ్యాలని బ్యాలెట్‌ పేపర్‌పై రెండు స్టాంపులు ఉన్న ఓట్లను పరిగణలోకి తీసుకోరాదని డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తానని తెలిపారు. ఈ సమావేశంలో అభినవ్‌, సిద్దాంత్‌ పాల్గొన్నారు.

దోశలో బొద్దింక ప్రత్యక్షం

బంజారాహిల్స్‌: ఓ హోటల్‌లో వినియోగదారుడు ఆర్డర్‌ చేసిన దోసలో బొద్దింక ప్రత్యక్షమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... రాఘవేంద్ర యశోద ఆస్పత్రి సమీపంలోని ఓ హోటల్‌కు వెళ్లి దోసను ఆర్డర్‌ చేశాడు. కొద్దిసేపటి తర్వాత బేరర్‌ దోసను తీసుకువచ్చాడు. రాఘవేంద్ర దోసను తింటుండగా అకస్మాత్తుగా దోసలో బొద్దింక దర్శనం కావడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు. దీంతో ఈ విషయాన్ని హోటల్‌ యాజమాన్యం దృష్టికి తీసుకురాగా వారి నుంచి నిర్లక్ష్యపు సమాధానం వచ్చింది. జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని రాఘవేంద్ర కోరాడు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్‌: బేగంపేట సబ్‌స్టేషన్‌ పరిధిలోని విద్యుత్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్‌ ఏడీఈ చరణ్‌సింగ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గవర్నమెంట్‌ హాస్పటల్‌ మెయిన్‌రోడ్డు, హోండా షోరూంలేన్‌, అమోఘ జూనియర్‌ కాలేజ, అభిరుచి లేన్‌, బల్కంపేట మెయిన్‌రోడ్డు, సోనీ వైన్స్‌ వెనుక ప్రాంతం, మధ్యాహ్న 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గవర్నమెంట్‌ హాస్పటల్‌ మెయిన్‌ రోడ్డు, హోండా షోరూం లేన్‌, అమోఘ జూనియర్‌ కాలేజ్‌, అభిరుచి లేన్‌, బల్కంపేట్‌ మెయిన్‌రోడ్డు, సోనీ వైన్స్‌ వెనుక ప్రాంతంలో విద్యుత్‌ కోత అమలులో ఉంటుందన్నారు.

వెంగళరావునగర్‌: కళ్యాణ్‌నగర్‌ పార్క్‌ 11 కెవీ ఫీడర్‌ బోరబండ సబ్‌స్టేషన్‌ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కళ్యాణ్‌నగర్‌ పార్క్‌, సారథీనగర్‌, శ్రీరామ్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేయబడుతుందని గ్రీన్‌లాండ్స్‌ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్‌ ఆదివారం తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రి 11 కెవీ ఫీడర్‌ బేగంపేట సబ్‌స్టేషన్‌ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రభుత్వ ఆసుపత్రి మెయిన్‌రోడ్డు, హోండా షోరూం, అమోఘ కాలేజీ లైన్‌, బల్కంపేట మెయిన్‌రోడ్డు, సోనీ వైన్స్‌ వెనుక ప్రాంతాల్లో విద్యుత్‌ సరాఫరాలో అంతరాయం ఉంటుందని, దీనిని వినియోగదారులు గమనించగలరని తెలిపారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో రూపాయల్లో..) టమాటా.33, నల్లవంకాయ 50, పొడుగు వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 75, క్యాప్సికమ్‌ 75, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 35, క్యారెట్‌ 75, దొండ 35, గుండుబీన్స్‌ 95, గింజ చిక్కుడు 95, గోకరకాయ 55, కీర 17, దోసకాయ 40, బీట్‌రూట్‌ 50, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 41, చామగడ్డ 38, మొరంగడ్డ 28, కందగడ్డ 65, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

తార్నాక జంక్షన్‌ పునరుద్ధరణ హర్షణీయం

లాలాపేట: తార్నాక జంక్షన్‌(సిగ్నల్‌)ను పునరుద్ధరిస్తామని ట్రాఫిక్‌ అడిషనల్‌ కమీషనర్‌ విశ్వప్రసాద్‌ ప్రకటించడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం తార్నాక డివిజన్‌ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రాముపర్మ, సీనియర్‌ నాయకులు వెంకటేష్‌గౌడ్‌, జిల్లా కార్యదర్శి ఎం. వీరన్న, శశి, ప్రకాష్‌ గౌడ్‌ తదితరులు మాట్లాడుతూ దాదాపు 8 సంవత్సరాల నుంచి తార్నాక చౌరస్తా సిగ్నల్‌ బంద్‌ చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కల్గుతుందన్నారు. దీంతో పాటుగా యూటర్న్‌ల వద్ద తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలనీ బీజేపీ ఆధ్వర్యంలో పలు మార్లు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు.

ప్లాట్‌ఫామ్‌పై జారిపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ ప్లాట్‌ఫామ్‌పై జారిపడిన ప్రమాదంలో ఆదివారం ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమబెంగాల్‌ రాష్ట్రం నోహన్‌పూర్‌కు చెందిన షేక్‌ సకీముద్దీన్‌ (39) నగరంలోని ఒక ప్రైవేటు భవన నిర్మాణ సంస్థలో మేస్త్రీగా పనిచేస్తున్నాడు. స్వగ్రామానికి వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చిన సకీముద్దీన్‌ 1వ నెంబర్‌ సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మూత్రశాలలోనికి వెళ్లాడు. వెళ్లి విసర్జన చేసి తిరిగి వస్తున్న సమయంలో మూత్రశాలల ముందు నీటినిల్వలుండడం, సకీముద్దీన్‌ రబ్బరు చెప్పులు ధరించి ఉండడంతో కాలుజారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్‌

రసూల్‌పురా: కంటోన్మెంట్‌ నియోజకవర్గ పరిధిలో సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ సభ్యులు ఈటెల రాజేందర్‌ హామీచ్చారు. ఆదివారం కంటోన్మెంట్‌ బోర్డు ఏడవ వార్డు పరిధిలోని పలు కాలనీల అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఎంపీ ఈటేల రాజేందర్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీల అసోషియేషన్‌ సభ్యులు మాట్లాడుతూ కాలనీల్లో సీసీ కెమెరాలు లేకపోవడం వల్ల దొంగతనాలు జరుగుతున్నాయని తెలిపారు. బోర్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో రక్షణ శాఖ స్థలం ఉన్నందున రహదారి విస్తరణ పనులు జరగడం లేదని దీంతో ట్రాఫిక్‌ సమస్య నెలకొని ఉందని చెప్పారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రోడ్డు సమస్యలు నెలకొన్నాయని వాటిని పరిష్క రించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పరశురాం, ప్రశాంత్‌ ప్రభు. కాలనీ అసోసియేషన్‌ సభ్యులు వైవీ. రావు, నరసింహ, బోస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడాలి



అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే వివేక్‌ వెంకటస్వామి తదితరులు

రసూల్‌పురా : ఎస్సీ వర్గీకరణ విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మాలల్లో ఐక్యత వచ్చినట్లు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌ వెంకటస్వామి తెలిపారు. కంటోన్మెంట్‌ నియోజకవర్గం బొల్లారంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముందు అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వివేక్‌ మాట్లాడుతూ మాలలకు ఎప్పుడూ అన్యాయం జరుగుతునే ఉందని వివక్షకు గురవుతున్న మాల వర్గానికి చెందిన ప్రజలంతా ఐక్యంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. మాలల జాతి పరిరక్షణకు హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటి నాయకులు చెన్నయ్య. మాల ఉప కులాల గ్రేటర్‌ హైదరాబాద్‌ చైర్మన్‌ రాజు వస్తాద్‌. ఆశ శ్రీరాములు, కంటోన్మెంట్‌ బోర్డు మాజీ సభ్యులు లోక్‌నాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్‌ డిస్‌ప్లేలతో వాహనదారులకు ఇబ్బందులు




ఎల్వీ ప్రసాద్‌ ఆస్పత్రి ముందు మూవింగ్‌ డిజిటల్‌ డిస్‌ప్లే

బంజారాహిల్స్‌: అత్యంత వెలుతురుతో ప్రకటనలు వచ్చే ఈ డిజిటల్‌ డిస్‌ప్లేల వల్ల వాహనదారుల కళ్లల్లోకి నేరుగా లైటింగ్‌ రావడం వల్ల ప్రమాదాలు కూడా జరుగుతాయని, వాహనాలను నియంత్రించలేకపోతారని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మూవింగ్‌ డిస్‌ప్లేలు నిషేధించినా ఇంకా ఎందుకు వినియోగంలో ఉన్నాయంటూ ఓ వాహనదారుడు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఇటీవల ఎక్స్‌లో ట్వీట్‌ చేశారు. బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–2లోని ఎల్వీ ప్రసాద్‌ ఆస్పత్రి పాదచారుల వంతెనకు, ముఫకంజా కాలేజీ పాదచారుల వంతెనకు..ఇలా ఖైరతాబాద్‌ జోన్‌ పరిధిలో ఏడు చోట్ల ఈ డిస్‌ప్లేలు ఏర్పాటు చేశారు. రాత్రిపూట అత్యంత కాంతివంతంగా ఇవి ఉండడంతో కళ్లల్లోకి వెలుతురు రావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయంలో వాహనదారులు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై ఇంతవరకు అధికారులు స్పందించలేదు. ఎన్నోసార్లు ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు చేసినా ఏ ఒక్కరూ స్పందించకపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. ఇప్పటికై నా అధికారులు స్పందించి మూవింగ్‌ డిస్‌ప్లేలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉద్యమకారుల రాష్ట్ర కోఆర్డినేటర్‌గా స్టాలిన్‌

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా బొమ్మెర స్టాలిన్‌ నియమితులయ్యారు. ఆదివారం సంఘం వ్యవస్థాపకులు పిడమర్తి రవి చేతుల మీదుగా నియమక పత్రాన్ని అందున్నారు. ఉద్యమకారులందిరికి 250 గజాల ఇంటి స్థలం ఇచ్చే వరకు పోరాడనున్నట్లు ఈ సందర్భంగా స్టాలిన్‌ పేర్కొన్నారు.

వైభవంగా గోవర్ధన పూజ, అన్నకూట దర్శనం



బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌–12లోని హరేకృష్ణ స్వర్ణ దేవాలయంలో కార్తీకమాసంలో భాగంగా గోవర్ధన పూజ, అన్నకూట దర్శనం అత్యంత వైభవంగా జరిగాయి. చిన్నకొండను పోలిన విధంగా 350 కిలోల వివిధ రకాల ఆహార పదార్థాలతో తయారు చేసిన అన్నకూటం ఈ వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అన్నకూట దర్శనం కోసం భక్తులు వందలాదిగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వేడుక భక్తులను మంత్రముగ్ధులను చేసింది. విశిష్టమైన సంప్రదాయాల సమ్మేళనంతో భక్తిపూర్వకమైన నైవేద్యాలు సందర్శకుల హృదయాలను కట్టిపడేసింది.

PUBLIC NOTICE

The public in General are hereby informed that our client K.L.SRINIVAS RAO, son of late K.Laxmanji, aged about 58 years, Occ: Electrical Engineer, R/o. H.No.12-11-1127, Boudha Nagar, Warasiguda, Secunderabad, who is owner of the Southern Part of the Property i.e. H.No.12-11-1127, Boudha Nagar, Warasiguda, Secunderabad. The then Northern property owner i.e. Smt. K.Lakshmi Bai, executed an alleged Sale Deed in favour of S.NARA GOUD, S/o. Bala Goud in respect of H.No.12-11-1127/1, admeasuring in all 193 sq.yards, Boudha Nagar, Warasiguda, Secunderabad and as such she filed a suit vide O.S. No.276 of 2005 before the XII Sr. Civil Judge (FTC), CCC, Sec'bad against me, for Recovery of Possession and the same was decreed on 01-08-2008 in favour of Smt.K.lakshmi Bai. Against the said Judgment and Decree, our client Sri K.L.Srinivas Rao filed Appeal before the Hon'ble High Court of Telangana vide CCCA No.241 of 2008. The said CCCA is still pending before the High Court for adjudication.

According to our client, any person entering into any transaction in respect of Northern side portion of property i.e. H.No. 12-11-1127/1, with S.NARA GOUD, S/o. Bala Goud, as the matter is sub-judice and pending before the Hon'ble High Court in CCCA No.241 of 2008, or with any other third parties, without the knowledge or consent of our client, will be doing so at their own risk as to costs and consequences. Any person intending to have any information with regard to the above said property can contact the undersigned or K.L.Srinivas Rao, Mobile No. 9848066171.

Sd/- MANU, Advocate
Premises No.10-3-174, St.John's Road, Sec'bad. Cell No. 9848135219